క్లుప్తంగా

కేజీబీవీ తనిఖీ



ఉపాధ్యాయులతో సమావేశమైన ఎంఈఓ సుభాన్

పగిడ్యాల: స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని ఎంఈఓ సుభాన్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పది, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థినులకు తర్ఫీదు ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి నాణ్యమైన విద్యబోధనను అందించాలని ఆదేశించారు. రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని పాఠశాల ప్రత్యేక అధికారిణి ఉషకు సూచించారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ రామాంజినాయక్

నందికొట్కూరు: అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని డీఎస్పీ రామాంజినాయక్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను, గదులను, పరిసరా ప్రాంతాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు చొరవ చూపాలని ఆదేశించారు. గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. రూరల్ సీఐ సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

విభూతి శివానుభూతిపై ప్రసంగం



ప్రసంగం వినిపిస్తున్న ప్రవచన కర్త

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాడ వీధులలో నిత్య కళా వేదికపై పరమేశ్వర విభూతి శివానుభూతి అనే అంశంపై ప్రసంగ కార్యక్రమం నిర్వహించారు. తెనాలికి చెందిన బ్రహ్మశ్రీ రాయప్రోలు జగదీశ్ చంద్రశర్మ పరమేశ్వర విభూతి- శివానుభూతిని వివరించారు. అనంతరం బాపట్లకు చెందిన ఎం.కృష్ణకిశోర్ క్షేత్ర మహిమాన్విత వైభవాన్ని వివరించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న సిబ్బంది

వెలుగోడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఏఓ పవన్ కుమార్ సమక్షంలో ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగ సిబ్బంది నారాయణ స్వామి, సుందరం భాస్కర్ పలువురు రైతులు పాల్గొన్నారు.

ఎంపీహెచ్ఈఓకు గాయాలు

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఎంపీహెచ్ఈఓ హుసేన్‌రెడ్డి సోమవారం రోడ్డుప్రమాదంలో గాయపడ్డారు. రుద్రవరం నుంచి విధులకు వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో స్వల్పగాయాలైనట్లు వైద్యాధికారి భగవాన్‌దాస్ తెలిపారు. నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు.

మున్సిపల్ కార్మికుల సంఖ్య పెంచాలి



మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు రషీద్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆత్మకూరురూరల్: పెరుగుతున్న పట్టణ విస్తీర్ణానికి అనుగుణంగా మున్సిపల్ కార్మికుల సంఖ్య కూడా పెంచాలని సీపీఐ నాయకులు ఏసురత్నం, రజాక్, రామ్ నాయక్ ,రణధీర్ తదితరులు కోరారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని గౌడు సెంటర్ నుంచి కార్మికులు మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు రషీద్‌కు, కమిషనర్ రమేష్‌బాబుకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగన్న, పెద్దనాగరాజు, గౌడుగు రాజు, తిమ్మయ్య పాల్గొన్నారు.

పూజలకు వేళాయె..

- 1 నుంచి రుద్రకోడూరులో కార్తీక ఉత్సవాలు
- నెలరోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు
- 15న కార్తీక దీపోత్సవం
- ప్రతిరోజూ భక్తులకు అన్నదానం



రుద్రకోడూరు పుణ్యక్షేత్రం

ఆత్మకూరు: నల్లమల అభయారణ్యంలో వెలసిన అత్యంత ప్రాచీనమైన రుద్రకోడూరు పుణ్యక్షేత్రంలో కార్తీకమాస ఉత్సవాలు నవంబర్ 1 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలు డిసెంబర్ 2వ తేదీ వరకు కొనసాగనున్నాయి. కార్తీకమాసంలో నాలుగు సోమవారాలు శ్రీ రుద్రాణి, రుద్రకోటీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ప్రతిరోజూ వేకువజామున 4 గంటలకు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహిస్తారు. శ్రీ రుద్రాణి మాతకు కుంకుమార్చనలు, అలంకార పూజలు చేపడతారు. నవంబర్ 15వ తేదీన కార్తీక పౌర్ణమి సందర్భంగా లక్ష దీపోత్సవం పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ప్రతిరోజూ భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

స్వయంభూ లింగాకారంగా వెలిసిన మహాశివుడు

నల్లమల అటవీ పరిధిలో కొన్ని వందల సంవత్సరాల క్రితం ఈ క్షేత్రం వెలిసింది. ఈ క్షేత్రంలో మహాశివుడు స్వయంభూ లింగాకారంగా వెలిసినట్లు పురాణాలు చెబుతున్నాయి. కై లాసంలో పార్వతీదేవితో స్వల్ప విషయంపై అలిగిన శివుడు భూలోకానికి వేయించేయు సమయంలో రుద్రకోడూరు వద్ద స్వయంభూ లింగాకారంగా అవతరించారని స్కందపురాణం తెలుపుతుంది. ఇక్కడ బ్రహ్మతో సహా ముక్కోటి దేవతలు రుద్రుడైన మహాశివుడిని శాంతింపజేసేందుకు తరలివచ్చినట్లు తెలుస్తుంది. ఈ క్షేత్రంలో రుషులు, మహాయోగులు పూజలు చేశారు. ఒకేరోజు సంగమేశ్వరం నుంచి శ్రీశైల క్షేత్రం, శ్రీశైలం నుంచి రుద్రకోడు క్షేత్రాన్ని సందర్శిస్తే సకల పాపాలు తొలగిపోతాయని పెద్దలు చెబుతారు. ఈ క్షేత్రం భక్తులకు కొంగుబంగారంలా, కోరిన కోర్కెలు నెరవేరుతాయని ప్రతీతి.

ఇలా చేరుకోవాలి..

రుద్రకోడూరు మహాక్షేత్రానికి ఆత్మకూరు నుంచి నల్లకాల్వకు వెళ్లి అక్కడ నుంచి రుద్రకోడూరు క్షేత్రం చేరుకోవచ్చు. ఆత్మకూరు నుంచి నల్లకాల్వ 5 కి.మీ., నల్లకాల్వ నుంచి రుద్రకోడు క్షేత్రం 14 కి.మీ. ఉంది. మోటార్ బైక్, ట్రాక్టర్ల ద్వారా ఈ క్షేత్రానికి భక్తులు చేరుకోవచ్చు.

ఆలయ పునరుద్ధరణ ప్రారంభ పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

బండి ఆత్మకూరు: మండలంలోని నారాయణపురం గ్రామంలో వెలసిన నారాయణ, ఆంజనేయ స్వామి ఆలయ పునరుద్ధరణ నిర్మాణ పూజలను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఆలయ పునర్నిర్మాణానికి కన్జర్వేషన్ గ్రాంట్స్ ఫండ్(సీజీఎఫ్) రూ.1.20 కోట్లు మంజూరయ్యాయి. పునర్నిర్మాణం ప్రారంభంలో భాగంగా అర్చకులు ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో గర్భగుడిలోని నారాయణ స్వామి, ఆంజనేయస్వామి విగ్రహాలకు పూజలు నిర్వహించి తొలగించారు. సంసందర్భంగా బాలాలయము పూజలు, హోమం నిర్వహించారు.

అవకాశాలు సృష్టించుకోవాలి



డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న ఏడీ విజయలక్ష్మి, ప్రొఫెసర్లు

మహానంది: అవకాశాలు సృష్టించుకోవాలని స్థానిక వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వీరజయలక్ష్మి విద్యార్థులకు సూచించారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన నూతన విద్యార్థుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఒత్తిడిని జయించి, కష్టమైనా ఇష్టంతో చదివితే ఫలితం కచ్చితంగా వస్తుందనన్నారు. అనంతరం విద్యార్థులకు జీవన నైపుణ్యాలపై డాక్టర్ కిషోర్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఫరీదా, డాక్టర్ త్రివిక్రమ్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లకీలో విహరించిన మహానందీశుడి దంపతులు



పల్లకీలో విహరిస్తున్న మహానందీశ్వర దంపతులు

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు సోమవారం రాత్రి పల్లకీసేవ నిర్వహించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, హనుమంతశర్మ, ఆంజనేయశర్మ, నాగేశ్వరశర్మ, అర్చకులు శరభయ్యశర్మ స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అలంకరించి గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకారపూజ, హారతిపూజలు చేపట్టి ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవం నిర్వహించారు.

కుళ్లిన కోడిగుడ్లతో మధ్యాహ్న భోజనం



విద్యార్థినులకు నాసిరకం కోడిగుడ్లను అందిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం మధ్యాహ్న భోజనంలో కుళ్లిన కోడిగుడ్లు ఇవ్వడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యాహ్న సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు కొందరు పాఠశాలకు వెళ్లి భోజనాన్ని పరిశీలించారు. కోడిగుడ్లు కుళ్లిపోయి ఉండడంతో వాటిని ఎలా తింటారని హెచ్‌ఎంను ప్రశ్నించారు. స్పందించిన హెచ్‌ఎం కోడిగుడ్లను ఏజెన్సీ వారు సరఫరా చేస్తున్నారని, ఏవి మంచివో, ఏవి చెడిపోయినవో తమకు తెలియడం లేదన్నారు. దీంతో గుడ్లను సరఫరా చేసే ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. పాఠశాలలో 800 మంది విద్యార్థినులు భోజనం చేస్తున్నారని, నాసిరకం గుడ్ల వల్ల అనారోగ్యానికి గురైతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఘటనపై ఎంఈఓ సురేష్‌ను వివరణ కోరగా మండలవ్యాప్తంగా ఇలాంటి గుడ్లు వచ్చాయని, అన్నింటినీ వెనక్కి పంపుతామని తెలిపారు. ఇదిలా ఉండగా కుళ్లిన కోడిగుడ్లను తీసుకునేందుకు విద్యార్థులు నిరాకరించారు.

సర్వే పక్కాగా చేయాలి

కొత్తపల్లి: వ్యాధులపై నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే పక్కాగా చేయాలని వైద్యాధికారి జబ్బీర్ సూచించారు. సోమవారం మండలంలోని ఎర్రమఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇంటింటి సర్వేపై సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఇంటింటికి తిరిగి వైద్యసిబ్బంది సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల గురించి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి క్యాన్సర్, డయాబెటిక్ (షుగర్), క్షయ(టీబీ), హైపవర్ టెన్షన్ ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి హకీమ్ రషీద్, స్టాఫ్ నర్సులు, వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సమస్యలుంటే పరిష్కరించుకోండి

కొత్తపల్లి: గ్రామాలలో సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాలలో ఎటువంటి సమస్య ఉన్న ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొని రావాలని సూచించారు. ఏ సమస్యకైనా వెంటనే పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో భూ కొలతల్లో సమస్యలపై రైతులు అర్జీలు అందజేశారన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు: మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వితని పత్రాన్ని కమిషనర్ బేబీకి అందజేశారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను ఆదుకుంటామని ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను అధికారంలోకి రాగానే విస్మరించడం తగదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు పరమేష్, నాగేశ్వరరావు, శ్రీనివాసులు, నాగన్న, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ

పగిడ్యాల: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు రాయపు కిరణ్‌కుమార్ రెడ్డి, శ్రీలతలు రూ. 12 వేల విలువ చేసే పోడియం వితరణగా అందజేశారు. సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రావుకు పోడియంను అందజేసి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి ఎల్లవేళలా తమ వంతు సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. క్రీడాశ్రీ పీతాంబరరెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరురూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు తహసీల్దార్ రత్నరాధికకు వినతిపత్రాన్ని అందజేశారు. ఎస్సీ ఎస్టీ వసతి గృహాలకు నూతన భవనాలు నిర్మించాలని, ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. దినేష్ కుమార్, సాయిప్రశాంత్, అంజిబాబు, కిరణ్, బాలాజీ పాల్గొన్నారు.

రేపు హుండీ కానుకల లెక్కింపు

మహానంది: మహానంది దేవస్థానంలో ఈనెల 30న హుండీ కానుకల లెక్కింపు చేపట్టనున్నట్లు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి ఆలయాలతోపాటు కోదండరామాలయం, వినాయక నంది, అన్నప్రసాదం, గోసంరక్షణ విభాగాల్లోని హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించనున్నట్లు తెలిపారు.

అర్హత ఉన్నా పింఛన్ ఇవ్వడంలేదు



గిరిజన మహిళ బయమ్మ

కొత్తపల్లి: పింఛన్ పొందేందుకు అర్హత ఉన్నా నాకు పింఛన్ ఇవ్వడంలేదు సారు.. అని భ్రమరాంబా గూడెంకు చెందిన గిరిజన మహిళ బయమ్మ సోమవారం విలేకరుల ఎదుట తన గోడు వెళ్లబోసింది. తకు రెండుకాళ్లు లేవని, పూర్తిగా అంగవైకల్యం కలిగి ప్రభుత్వం నుంచి పింఛన్ కోసం ఎదురు చూస్తున్నా.. ఇప్పటి వరకూ ఇవ్వలేదని వాపోయింది. పనిచేసుకునే శక్తిలేదు, తన భర్తకు కూడా పక్షవాతంతో భాదపడుతున్నాడని, పనిచేసుకొలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేసింది. తినేందుకు తిండిలేక ఒక్కోసారి పస్తులు పడుకుంటున్నామని చెప్పింది. భర్త ఊర్లో అడుక్కొచ్చి తనకు తిండి పెడుతున్నాడని, కొంతమంది మనసుకరిగి సహాయం అందిస్తున్నారని తెలిపింది. దీంతో జీవనాన్ని నెట్టుకోస్తున్నామంది. అయినా ఏ అధికారికి తనకు పింఛన్ ఇప్పించేందుకు మనసు రాలేదా అని ప్రశ్నిస్తోంది. అన్నీ ఉన్నవారికి, పనిచేసుకొని జీవనం సాగించే వారికూడా నెలనెలా పింఛన్ ఇస్తున్నారు.. కానీ పూర్తిగా అంగవైకల్యం కలిగిన తనకు ఏళ్లు గడుస్తున్నా పింఛన్‌మాత్రం ఇచ్చే నాథులే కరువయ్యారని కన్నీటి పర్యాంతమైంది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరింది.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆత్మకూరు: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.దినేష్‌కుమార్, ఆత్మకూరు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సాయి, ప్రశాంత్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగాన్ని ప్రక్షాళన చేస్తానని హామీ ఇచ్చిన లోకేష్ నెలలు గడుస్తున్నా చర్యలు తీసుకోకపోవడంత తగదన్నారు. తల్లికి వందనం, పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర పథకాలపై నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా పథకాలను సక్రమంగా అమలు చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అంజిబాబు, కిరణ్, బాలాజీ, దిలీప్ పాల్గొన్నారు.

వడ్డెర కులస్తుల డిమాండ్లు పరిష్కరించాలి

వెలుగోడు: వడ్డెర కులస్తుల డిమాండ్లు వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని వడ్డెర సంఘం జాతీయ కార్యదర్శి శిల్పి సుబ్బరాయుడు కోరారు. సోమవారం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శ్రీనివాసగౌడుకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వడ్డెరలను వెంటనే ఎస్టీ జాబితాలో చేర్చాలని, గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు మైనింగ్ గనుల్లో నూటికి 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, వడ్డెర సొసైటీలకు రాయల్టీలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర కార్యదర్శి వెంకటేష్, వెంకటసుబ్బయ్య, శివ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం



ఉప కారాగారంలో ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి ఆర్వీవీఎస్ మురళీకృష్ణ

ఆళ్లగడ్డ: ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ఆళ్లగడ్డ ఐదో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవా సంఘం అధ్యక్షులు ఆర్వీవీఎస్ మురళీకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక ఉప కారాగారాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కారాగారంలో ఉన్న ఖైదీలతో ఏ ఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారు.. ఎప్పటినుంచి రిమాండ్‌లో ఉంటున్నారు.. అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. కేసులు వాదించేందుకు మీకు న్యాయవాదులు ఉన్నారా అని ఆరా తీశారు. అలాగే జైలులో కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. ఉచిత న్యాయ సహాయం కావాలంటే లోక్ అదాలత్ ను సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా న్యాయ సేవల గురించి తెలుసుకోవాలంటే 15100 కి ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో జైలు అధికారి శల్వంత్, కోర్టు, జైలు సిబ్బంది పాల్గొన్నారు

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



సుజాత(ఫైల్)

బండిఆత్మకూరు: మండల పరిధిలోని జి.లింగాపురం గ్రామంలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఎస్ఐ జగన్ మోహన్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన అంబటి శేఖర్‌రెడ్డి కూతురు సుజాత(36)కు అదే గ్రామానికి చెందిన మాధవరెడ్డికి 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇంటర్ చదివే కుమారుడు, టెన్త్ చదివే కూతురు ఉన్నారు. కాగా కొంతకాలంగా భర్త మాధవరెడ్డి మద్యానికి బానిసై భార్యతో గొడవ పడేవాడు. ఈక్రమంలో పలుమార్లు సుజాత పుట్టినింటికి వెళ్లి మళ్లీ వచ్చేది. ఆదివారం రాత్రి కూడా భార్యభర్తల మధ్య గొడవ జరిగినట్లు సమాచారం. కాగా సోమవారం తెల్లారేసరికి సుజాత విగతజీవిగా పడి ఉంది. తనకేమీ తెలియదని భర్త బుకాయిస్తుండగా.. తన కూతురిని అల్లుడే హతమార్చి ఉంటాడని మృతురాలి తండ్రి అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నంద్యాలకు చేరుకున్న శ్రీరామయంత్రం

నంద్యాల(వ్యవసాయం): కంచికామకోటి పీఠాధిపతి శ్రీవిజయేంద్రసరస్వతి ఆధ్వర్యంలో అయోధ్య భవ్యరామ మందిరంలో ప్రతిష్ఠింపదలచిన శ్రీరామయంత్రం సోమవారం నంద్యాలకు చేరుకుంది. స్థానిక శ్రీప్రథమనంది దేవస్థానంలో బ్రాహ్మణ సేవా సమాఖ్య సభ్యులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అధ్యక్షుడు మురళీకృష్ణారావు మాట్లాడుతూ ఈ యంత్రాన్ని తిరుపతిలోని కంచి పీఠం నుంచి ప్రత్యేక రథంలో అయోధ్యకు తరలిస్తున్నట్లు తెలిపారు. 45 రోజుల తర్వాత అక్కడికి చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో సేవా సమాఖ్య సభ్యులు సీతారామశర్మ, కేశవమూర్తి, సుధీంద్రాచార్యులు, కార్తికేయశర్మ, ప్రశాంతి, కాదంబిని పాల్గొన్నారు.

జీవ వైవిధ్యాన్ని పరిరక్షించండి



మాట్లాడుతున్న ప్రతినిధి రుషి పంత్

నంద్యాల: జిల్లాలో జీవ వైవిధ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, ఇది అధర్ ఎఫెక్టివ్ ఏరియా బేస్డ్ కన్జర్వేషన్ మెజర్స్ ప్రధాన ఉద్దేశమని యూఎన్‌డీపీ ప్రతినిధి రుషి పంత్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో యూఎన్‌డీపీ బృందం వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, పరిశ్రమలు, డీఆర్‌డీఏ, ఇరిగేషన్ శాఖల అధికారులతో ప్రిలిమినరీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూఎన్‌డీపీఓ ప్రతినిధి మాట్లాడుతూ జిల్లాలో అటవీ ప్రాంతాలు, పరిశ్రమలు, సాగునీటి ప్రాజెక్టులు ఇతర ప్రభావవంతమైన ప్రాంత జీవ వైవిధ్య పరిరక్షణకు స్థానికంగా ఉన్న జీవ వనరులను గుర్తించాలన్నారు. ఇందుకు సంబంధిత అధికారులు, జిల్లా యంత్రాంగం సహకారం అందించాలన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ యూఎన్‌డీపీ బృంద సభ్యులకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, అధికారులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం



సీజ్‌చేసిన అక్రమ మద్యం బాటిళ్లను చూపుతున్న ఎస్ఐ సురేష్ బాబు

పాములపాడు: మండలంలోని మద్దూరు గ్రామ పంచాయతీ మజరా క్రిష్టానగర్ గ్రామానికి చెందిన సోమనాయక్ అనే వ్యక్తి అక్రమంగా తీసుకెళ్తున్న 15 మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు. సోమవారం సమాచారం మేరకు గ్రామం సమీపంలోని ఆంజనేయ స్వామి గుడి సమీపంలో అక్రమంగా మద్యం తీసుకెళ్తుండగా అరెస్టు చేసినట్లు చెప్పారు. అతని వద్ద నున్న మద్యం బాటిళ్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఏఎస్ఐ ఏసయ్య, హెడ్‌కానిస్టేబుల్ రామేశ్వర్ ఉన్నారు.

నాటుసారా అమ్మితే కేసులు తప్పవు

నందికొట్కూరు/జూపాడుబంగ్లా: చట్టానికి వ్యతిరేకంగా నాటుసారా అమ్మితే కేసులు తప్పవని ఎక్సైజ్ శాఖ సీఐ రామాంజనేయులు హెచ్చరించారు. సోమవారం జూపాడుబంగ్లా మండలం పి. లింగాపురం వద్ద గుండెపోగు కళ్యాణ్ నాటుసారా విక్రయిస్తుండగా 10 లీటర్లు స్వాధీనం చేసుకున్నారు. సారా విక్రయించినా, తయారు చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్ఐ జఫ్రుల్లా, హెడ్ కానిస్టేబుళ్లు పద్మనాభం, శంకర్ నాయక్, పోలీసులు సుధీర్, మధుప్రసాద్, సంధ్యారాణి ఉన్నారు.

నాటుసారా స్వాధీనం

మండల పరిధిలోని శాతనకోట గ్రామంలో షికారి రవీంద్ర నాటుసారా విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ తిరుపాలు తెలిపారు. గ్రామ ప్రజలు అందించిన సమాచారం మేరకు దాడి చేసి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారని చెప్పారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం



నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ శబరి, ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: పట్టణంలోని పగిడ్యాల రోడ్డు బైరెడ్డినగర్‌లో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే జయసూర్య సోమవారం ప్రారంభించారు. కాగా ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే వర్గం, ఎంపీ వర్గం మధ్య తోపులాట చోటు జరిగింది. లోపలికి రాన్వికుండా ఎమ్మెల్యే గన్‌మెన్ అడ్డుకోవడంతో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కాకరవాడ వెంకటస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతలోనే డీఎస్పీ రామాంజినాయక్, రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం జోక్యం చేసుకుని కాకరవాడను సైడ్‌కు తీసుకెళ్లడంతో గొడవ సద్దుమణిగింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కమిషనర్ బేబి, వైస్ చైర్మన్ రబ్బానీ, వైద్యులు, సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.